క్లుప్తంగా

నేడు వేమన జయంతి

కడప కల్చరల్ : విశ్వకవి యోగివేమన జయంతి ఉత్సవాలను స్థానిక రెడ్డి సేవాసమితి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, ప్రతినిధి పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. కడప రాజీవ్ మార్గ్‌లోని రెడ్డి సేవా సమితి కార్యాలయం వద్ద ఉదయం పది గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు.

విద్యుత్తు కార్యాలయంలో స్వచ్ఛ భారత్



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు కార్యాలయం ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో హరి సేవ్యా నాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఉచితంగా భోజనం



నిరాశ్రయులకు పండ్లు పంపిణీ చేస్తున్న కుటుంబ సభ్యులు

కడప ఎడ్యుకేషన్ : చెన్నూరు గ్రామానికి చెందిన నీలం పుల్లారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన కుమారుడు నీలం వెంకటసుబ్బారెడ్డి కడప నిరాశ్రయుల వసతి గృహంలో పేదలకు భోజనంతోపాటు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్తాల అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొని భోజనం వడ్డించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు వచ్చే అవకాశం తక్కువ అని డాక్టర్ పద్మిని అన్నారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌లో భాగంగా శనివారం శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీలో డాక్టర్‌తోపాటు సిబ్బంది పరిసరాలు శుభ్రం చేసి మొక్కలకు నీరు పోశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను విధిగా పెంచాలన్నారు. చెట్లు మనకు నీడతోపాటు, ఆరోగ్యాన్నిస్తాయని చెప్పారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌కాంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సీఓ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజీఈఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ

కడప ఎడ్యుకేషన్ : ఆర్‌ఎస్‌ఎఫ్ విద్యార్థుల పక్షాన నిరంతరం గళం విప్పడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ అన్నారు. కడప జెడ్పీ ఆవరణలో ఆర్‌ఎస్‌ఎఫ్ క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం.ఓబులేసు యాదవ్, ఎం.రమేష్ కుమార్, కృష్ణ ప్రసాద్, రఘురామ నాయుడు, సుదర్శన్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు

ఎన్టీఆర్‌కు నివాళి



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాధవీరెడ్డి

కడప రూరల్ : నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా నగరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ అటు సినీనటుడిగా, ఇటు రాజకీయ నాయకుడిగా రాణించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

అక్కయపల్లి ప్లాజా.. కళా విహీనం

ఆకతాయిల చేష్టలతో ఉద్యానవనాల్లో బొమ్మలు చెదిరిపోతున్నాయి. కడప నగరంలోని ఒక్కో ప్రాంతంలో ఒక్కోచోట పార్కు ఏర్పాటుచేశారు. వందలాది జనం సేద తీరేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన అక్కయ్య ప్లాజా అందరినీ ఆకట్టుకుంది. అయితే నేడు కొందరి మందుబాబులు, అల్లరి మూకల చేష్టలతో కళావిహీనంగా మారుతోంది. లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన బొమ్మలు చెదిరిపోయాయి. బండలు, స్తంభాలు ఒరిగిపోయాయి. వాటిలో సాక్షి కెమెరాకు చిక్కిన చిత్రాలివీ..

– రఫీ సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్



అక్కాయపల్లి ప్లాజా



బొమ్మ పగిలిందిలా..



చేయి విరిగిపోయి కళా విహీనంగా..



బండలు పగలగొట్టి..



ఒరిగిన రాయి

జనవరి 20న ప్రత్యేక వ్యాపార దినం

కడప కల్చరల్ : ఎల్‌ఐసీ జాతీయీకరణ లక్ష్యాలను కొనసాగించే చర్యలను కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ రెడ్డి, శ్రామిక మహిళా కన్వీనర్ పి.వసుప్రద ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జనవరి 20న దేశ వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక వ్యాపార దినం జయప్రదం చేయాలని వారు కోరారు. ప్రజలు ఎల్‌ఐసీ పాలసీలు తీసుకోవాలని, తద్వారా తమ కుటుంబాలకు బీమా రక్షణ, దేశ ఆర్థికవ్యవస్థకు స్వావలంబన కల్పించాలని కోరారు. బీమా రక్షణకు, రాబడికి, సేవలకు, చెల్లింపులకు నికరమైన ప్రభుత్వ హామీ ఉండడం ఎల్‌ఐసీ ప్రత్యేకతలని గుర్తు చేశారు.

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు కృషి



ఆర్‌జేడీని సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరి ప్రసాద్, ఎస్.జాబీర్ కోరారు. పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌ను శనివారం కడప ఆర్జేడి కార్యాలయంలో వారు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాలకులు ప్రవేశపెట్టిన సంస్కరణలు ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చినట్లుగా ఉన్నాయని తెలిపారు. విద్యా క్షేత్రంలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కె.నరసింహారావు, సీపీ.రమణ, ఎస్.ఎజాస్‌అహ్మద్, ఎం.ప్రభాకర్, దిలీప్ చక్రవర్తి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండికోటలో సినీ స్టూడియో నిర్మించాలి

కడప కల్చరల్ : జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధితోపాటు గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన గండికోటలో రెండు ఫ్లోర్‌లతో సినీ స్టూడియో ఏర్పాటు చేయాలని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి కోరారు. మైదుకూరుకు విచ్చేసిన సీఎంను శనివారం ఆయన కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలోని సిద్దవటం కోట, పుష్పగిరి ఆలయ సముదాయాలను పరిరక్షించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. గండికోటలో 2019లో రోప్‌వేను ఆపేశారని, ఇప్పుడైనా పూర్తి చేయాలని కోరారు. కలమల్లలోని అపురూపమైన తొలి తెలుగు శాసనాన్ని రక్షించేందుకు బాషా వైభవాన్ని చాటే చర్యలు చేపట్టాలని కోరారు. వనిపెంట ఇత్తడి పరిశ్రమ, శెట్టిగుంట కొయ్య బొమ్మల తయారీ, మాధవరం చేనేతలకు చెందిన బొట్ లెట్లను ఒంటిమిట్ట, గండికోటలో లేపాక్షి పద్ధతిలో ఏర్పాటు చేయాలని కోరారు.


అల్మాస్ పేటను టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా గుర్తించాలి



మేయర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నజీర్ అహ్మద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని అల్మాస్‌పేట సర్కిల్‌కు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా నామకరణం చేయాలని నగర ప్రముఖులు నజీర్ అహ్మద్ కోరారు. నగర మేయర్ సురేష్‌బాబును శనివారం ఆయన కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. సమావేశంలో తీర్మానం చేసి ఎల్‌ఈడీ లైటింగ్ బోర్డు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ విషయంగా గతంలోనూ పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి



బహిరంగ లేఖ చూపుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఓ బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు. కేసీ కెనాల్ చివరి ఆయకట్టు స్థిరీకరణ, గాలేరు– నగరి, తెలుగుగంగ, హంద్రీ నీవా రెండో దశ పనులు చేపట్టాలన్నారు. పంటకాల్వల నిర్మాణం పూర్తి చేయాలని, సోమశిల భూ నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని, శ్రీశైలం కనీస నీటిమట్టం 854 అడుగులు ఉండేలా చూడాలని కోరారు. ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, ఏపీజీబీ ప్రధాన కార్యాలయాలను కడపలో కొనసాగించాలన్నారు. ఆర్‌టీపీపీ నిర్మాణంలో భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించి, పులివెందుల మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు నిర్వహించాలన్నారు. పోరుమామిళ్ల మండలం తిరుపతిరెడ్డి కాలనీ, బద్వేల్ మండలం భగత్‌సింగ్ నగర్, సిఆర్.నగర్(సి.కొత్తపల్లె), వాకరాపేట సీపీఐ కాలనీ, గోపవరం మండలం పీపీ.కుంట కాలనీ ప్రజలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వీసీ క్రిష్టారెడ్డిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, కేసీ.బాదుల్లా పాల్గొన్నారు.

యథావిధిగా కొనసాగించండి

ఆర్జేడీ శామ్యూల్‌కు రూట వినతి



రూట నాయకులతో కలిసి డైరీ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ శామ్యూల్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఉర్దూ మీడియం సెక్షన్ పాఠశాలలను కామన్ స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుసంధానం చేసినా.. గతంలో మాదిరిగానే మాదిరిగా ఉర్దూ డీఐ, ఉర్దూ ఏఎమ్ఓల పర్యవేక్షణలో తరగతులు జరిగేలా చూడాలని రూట రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ కోరారు. పాఠశాల విద్య ఆర్‌జేడీ శామ్యూల్‌ను శనివారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రూట డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులకు తప్పకుండా న్యాయం చేయాలని, పాఠశాలల అభివృద్ధికి చేయూత నివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాజీ అబ్దుల్‌హకీం సాహెబ్, మహమ్మద్ అయ్యాబ్, సయ్యద్ సిరాజుద్దీన్, అఫ్జల్ బాషా, మస్తాన్ వలి, బేపారి ఫక్రుద్దీన్, జుబేర్ అహ్మద్, అబ్దుల్‌ముజీబ్ పాల్గొన్నారు.

పీఎఫ్ స్లిప్‌లు వెబ్‌సైట్‌లో పొందుపరచండి



జెడ్పీ సీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది ప్రావిడెంట్ ఫండ్ వార్షిక వివరాల స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప జిల్లా పరిషత్ సీఈఓ ఓబులమ్మను తన కార్యాలయంలో శనివారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి చెందిన పీయఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, నెలవారీ జమను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచడంతోపాటు రుణాలు, ఫైనల్ పేమెంట్ల మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. టీచర్ల ఖాతాలకు జమకాని డీఏ మొత్తాలను వారి అకౌంట్లకు జమచేయాలని విన్నవించారు. జెడ్పీ సీఈఓ ఓబులమ్మ మాట్లాడుతూ నెలరోజులలో పీఎఫ్ స్లిప్‌లను అందచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, క్రిష్టారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించాలి

కమలాపురం : ప్రజలు పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించి నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి తెలిపారు. శనివారం నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ ఆధ్వర్యంలో పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఇందులో భాగంగా చెత్త కుండీలున్న చోట శుభ్రం చేసి మెప్మా మహిళలు రంగు వల్లులు వేసి ఆ ప్రాంతాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జేసీబీల ద్వారా డ్రైనేజీలను శుభ్రం చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు.

అర్హులైన పేదలకు రెండెకరాల భూమి ఇవ్వాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలో అర్హులైన పేదలకు రెండు ఎకరాల భూములు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సాగు భూమి సాధన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ సాగు భూమికి అర్హులైన పేదల జాబితాను ఎంపిక చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ రెండెకరాల సాగు భూమి పంపిణీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో పి.చంద్రశేఖర్, కె.మునెయ్య, బ్రహ్మం బి.శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కోడింగ్‌పై అవగాహన సదస్సు

చింతకొమ్మదిన్నె : స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో హైదరాబాద్ బీవీఆర్ఐటీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు డాక్టర్ ఎం.ఇంద్రసేనారెడ్డి కాంపిటేటివ్ కోడింగ్ ఇన్ పైతాన్ అనే అంశంపైన శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కోడింగ్ మరియు పైథాన్ యొక్క అవశ్యకత, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మరియు డీప్ లర్నింగ్ విభాగాలలో పైతాన్ కోడింగ్ తదితర విషయాలను క్షుణ్ణంగా వివరిస్తూ ఉద్యోగ అవకాశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అన్ని రంగాలలో అన్ని విభాగాలకు చెందిన నిపుణులతో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని, వీటివల్ల విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించవచ్చు అన్నారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

వల్లూరు : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చని డీఎల్‌పీవో విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రఘురాం పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను చేపట్టారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వల్లూరులో జరిగిన కార్యక్రమంలో కడప డివిజనల్ పంచాయతీ అధికారి విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, పిల్లలతో మానవహారంగా నిలబడి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య నిర్వహణ గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. నెలలో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర –స్వచ్ఛ దివస్ కార్యక్రమంను అన్ని పంచాయతీలలో నిర్వహించి పారిశుధ్య పనులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌జేడీకి సత్కారం

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్య రెగ్యులర్ ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన కాగిత శ్యాముల్‌ను జిల్లా విద్యా శాఖ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీ మునీర్‌ఖాన్, బాదుల్లా, వెంకటేశ్వర్లు, బ్రహ్మానందరెడ్డి, నాగేశ్వర రెడ్డి, జ్వాలాపతి, ఏసన్న, రెహమాన్, హరి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

వీరపునాయునిపల్లె : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన వ్యాధులకు దూరంగా ఉంటామని మండల వైద్యాధికారులు మహమ్మద్ తాహ, ఖాదర్‌బాషాలు తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిత్యం మన జీవితంలో వ్యక్తిగత పరిశుభ్రత ఎలా పాటిస్తామో అలాగే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, పులి రామ్‌సింగ్ పల్లెల్లో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు.

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప వైఎస్సార్ సర్కిల్: బీజేపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో శనివారం ఆమె మాట్లాడుతూ ఆర్.ఎస్.ఎస్. చీఫ్ మోహన్ భగవత్ అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఈ విషయంపై 1947లో దేశానికి స్వాతంత్ర్యం రాలేదని చెప్పి ప్రజలను అవమానించారని, బ్రిటీష్ వారిపై పోరాడిన యోధులను కించపరిచారని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. దీనికి బీజేపీ నాయకులు దగ్గుబాటి పురందేశ్వరి, లంకా దినకర్ రాహుల్ గాంధీపై తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1947నుండి 2014 వరకు 60 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రధాన మంత్రులు దేశాన్ని పాలించారని బీజేపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. మోదీ గొప్పగా ప్రారంభించిన సోనామార్గ్ (జోజిలా టన్నెల్)కు కాంగ్రెస్ ప్రభుత్వంలో పునాదులు పడ్డాయన్నారు. ఈ సమావేశంలో కడప అసెంబ్లీ కో ఆర్డినేటర్ బండి జకరయ్య, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూరతోటి విజయ్‌కుమార్, కుల్లాయప్ప, హరి ప్రసాద్, మైనుద్దీన్, సిరాజుద్దీన్, పాల్గొన్నారు.

పీఆర్సీ అమలులో జాప్యం తగదు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు చేయడంలో జాప్యం తగదని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(1938) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి డిమాండ్ చేశారు. కడప ఎన్జీవో హోంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పీఎఫ్ లోన్స్, ఏపీ జీఎల్ఐ క్లెయిమ్స్‌తోపాటు సరెండర్ లీవ్‌లు వెంటనే ప్రకటించాలని కోరారు. జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు రాజు, అబ్దుల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాజులు, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఖాశీంవలి, శంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రమేష్‌బాబు, నాగభూషణం, శ్రీనివాసులు, నారాయణస్వామి, సుబ్బారెడ్డి, దీనదయాల్, వేణు, రమణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల్లో అక్రమాలు లేకుండా చూడాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ శామ్యూల్

కడప ఎడ్యుకేషన్ : రాబోయే ఉపాధ్యాయుల బదిలీల్లో అక్రమాలు జరగకుండా చూడాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్‌జేయూపీ) రాష్ట్ర అధ్యక్షుడు డా.గునిసెట్టి శ్రీనివాసులు కోరారు. ఉపాధ్యాయ బదిలీల్లో అవకతవకలు జరగకుండా ఉండాలంటే పెర్ఫార్మన్స్ పాయింట్లు ఉంచడం సబబు కాదని, కేవలం సీనియారిటీ, సర్వీసుకు పాయింట్లు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్‌జేడీ శామ్యూల్‌కు వినతిపత్రం అందజేశారు. గునిసెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ జీవో 117 రద్దు క్రమంలో నూతనంగా ప్రవేశ పెట్టబోయే ప్రాథమిక మోడల్ స్కూల్స్‌ను పారదర్శకంగా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆర్జేయూపీ డైరీ, క్యాలెండర్‌ను ఆర్జేడీతో కలిసి సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షరీఫ్, ముత్తోజు వీరబ్రహ్మం, ప్రసాదరావు, వెంకట సుబ్బయ్య, వీరయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తాం

వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సహకారం అందించాలని ఊటకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కడప ఊటకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లా ఏడీఏలకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలైన వరి, నువ్వులు, వేరుశనగ, బొప్పాయి, మామిడి, అరటి పంటల సాగుపై చర్చించారు. వాటికి ఆశించే చీడపీడల నివారణపై అరా తీశారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహిస్తూ పంటలను పరిశీలిస్తున్నారన్నారు. ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతుల ఆర్థికావృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులకు పంటలసాగుకు తగిన శిక్షణ ఇస్తుందన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాధికారులు పర్యవేక్షిస్తూ రైతులకు కావాల్సిన సూచనలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఊటకూరు ఏఆర్ఎస్ డీఆర్‌సీ రమణారెడ్డి, కలికిరి కేవీకే శాస్త్రవేత్త పీరుసాహెబ్, కేవీకే వనిపెంట శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్, కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎల్.నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్సార్ సర్కిల్ : గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు అరకొర వేతనాలు ఇచ్చారని, కొన్ని పంచాయతీలలో 10 నుంచి 16 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొన్ని గ్రామాల్లో వేతనం అడిగితే అసలు మీరు పనే చేయలేదని చెప్పేసి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. చెత్త బండ్ల మరమ్మతులకు డబ్బులివ్వడం లేదని, డ్రస్సులు, మాస్కులు, చెప్పులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ.బాదుల్లా పాల్గొన్నారు.

రేషనలైజేషన్ చట్టబద్ధతకు అసంబద్ధాలు తొలగించండి



సమస్య వివరిస్తున్న పీఎస్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : బదిలీలు, రేషనలైజేషన్ చట్టబద్ధతకు అసంబద్ధాలను తొలగించాలని పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌జేడీ శామ్యూల్‌ను శనివారం వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117 జీవో ప్రకారం 6, 7, 8వ తరగతుల్లో 94 మంది విద్యార్థులు దాటితే మూడవ సెక్షన్‌గా చేయడంతో వేలాది స్కూల్ అసిస్టెంట్లు సర్ ప్లస్ అవుతారన్నా రు. బదిలీలలో పెర్ఫార్మెన్స్ పాయింట్ల విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీవీ.సుబ్బారెడ్డి, ఎవీ.సుబ్బారెడ్డి, సీపీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, మోహన్ రెడ్డి, దిలీప్ కుమార్, నాయమూర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.